బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 29 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## 30న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డిసెంబర్ 30వ తేదీన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నారు. మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి రాష్ట్ర శాసనసభ సంతాపం తెలపనుంది. ఈమేరకు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నరసింహచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుంది. అనంతరం మన్మోహన్ సింగ్ మృతి నేపథ్యంలో సంతాపం ప్రకటించనుంది. సంతాప దినాల్లో భాగంగా అసెంబ్లీని సమావేశపరుస్తున్నారు. శ్వాస కోశ సంబంధిత సమస్యలతో గురువారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో మన్మోహన్ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇప్పటికే కేంద్రం వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సైతం వారం రోజులు సంతాప దినాలుగా నిర్వహించనున్నట్టు తెలియజేసిన విషయం విదితమే.

# హైడ్రా కూల్చివేతలు ఆగవు



- కొంత గ్యాప్ మాత్రమే వచ్చింది
- ఇప్పటికే భూకబ్జాదారులో భయం పుట్టింది
- ఇప్పటికే నివాసముంటున్న పేదలు, సామాన్యుల ఇండ్ల జోలికి హైడ్రా వెళ్లదన్నారు.
- కొనుగోలుదారులకు సమగ్ర సమాచారం కోసం త్వరలో హైడ్రా యాప్
- 2025లో ప్రభుత్వ పార్కులు, చెరువుల వద్ద జియో ఫెన్సింగ్
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైడ్రా కూల్చివేతలు ఆగవని... చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించిన తర్వాత మళ్లీ కూల్చివేతలు మొదలు పెడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. అయితే హైడ్రా అనగానే కూల్చడం అనే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి తీసుకెళ్ళారని, హైడ్రా పనితీరుతో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై చర్చ జరుగుతోందని, అధిక సంఖ్యలో ప్రజలకు అవగాహన వచ్చిందని

శనివారం హైదరాబాద్ బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వార్షిక నివేదికను, హైడ్రా పనితీరు, సమస్యలు, అధిగమిస్తున్న సవాళ్లపై కమిషనర్ వివరాలను వెల్లడించారు. పార్కులు, చెరువులు, కుంటలను కబ్జాల నుంచి కాపాడుతున్నామని తెలిపారు. 2024, జులై 19న హైడ్రా ఏర్పడిందని, దాన్నే డెడ్‌లైన్‌గా తీసుకున్నామని, అప్పటి నుంచి ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు 5800 ఫిర్యాదులు అందాయన్నారు. అనధికార నిర్మాణాలపైనే ఎక్కువగా ఫిర్యాదులున్నాయని, అయితే ప్రజలు, కమ్యూనిటీ పరంగా వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. 200 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని,1025 వాటర్ బాడీలను గుర్తించామన్నారు. 12 చెరువుల పునరుద్ధరణకు డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామని, ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామన్నారు. మూసీ రివర్ ప్రాజెక్టుకు హైడ్రాకు సంబంధం లేదన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో త్వరలో 'ఎఫ్‌ఎం' ఛానెల్ ప్రసారం జరగనుందన్నారు. జులై 2019 తరువాత వచ్చే అనుమతుల పై హైడ్రా కఠినమైన చర్యలు ఉంటాయన్నారు.కొత్తగా కొనుగోలు చేసే వాళ్ళు అన్ని కోణాల్లో దర్యాప్తు చేశాకే కొనుగోలు చేయాలన్నారు. చెరువుల వద్ద ఉన్న షెడ్స్ అద్దెకు తీసుకునే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌టీఎల్ మారడానికి ఎన్నో కారణాలుంటాయన్నారు. సర్వే ఆఫ్ ఇండియా నుంచి ఇమేజ్ రికార్డులు సేకరించామని, శాటిలైట్ టెక్నాలజీ ఉపయోగించి చెరువుల వద్ద ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించి హైడ్రా యాప్‌లో పెడ్తామన్నారు. 2025లో ప్రభుత్వ పార్కులు, చెరువుల వద్ద జియో ఫెన్సింగ్ చేయబోతున్నామని తెలిపారు. త్వరలో ఒక హైడ్రా పోలీస్ స్టేషన్ రానుందన్నారు. త్వరలో 70 డీఆర్‌ఎఫ్ టీమ్స్ రాబోతున్నాయన్నారు. 'డీజీఐఎండీ' నుంచి వెదర్ రేడార్ రాబోతుందన్నారు. అనాధికారిక నిర్మాణాల పై హైడ్రా కఠినంగా ఉంటుందని, అనాధికరిక కట్టడాల పై కోర్టులు సైతం కూల్చమనే చెప్తాయన్నారు. ఒక ఎకరాలను కాపాడుకోగలిగితే దాదాపు 4వేల మీల్లీమీటర్ల నీరు రక్షించినట్టు అవుతుందన్నారు. నల్లకుంటలోని బతుకమ్మకుంట చెరువు వ్యవహారంలో కోర్టులో పిటీషన్లు ఉన్నాయని, వాటిపై విచారణ జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం దెబ్బతినలేదని, పేదలను ముందు చూపి వెనకాల మాఫీయా వేరే ఉంటుందని, అలాంటి వారే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆక్రమణదారులకు సహకరించిన వారితోపాటు, అక్రమ నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులను సైతం వదిలిపెట్టమని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు ఏ ఒక్కరి సొంతం కాదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

### త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్లు

త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని చెరువులు, ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడుతుందన్నారు. రెండు వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పని చేస్తుందని తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు తమకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. అయినా మూసీ ఆక్రమణలపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ఆక్రమణల విషయంలో భూ యజమానులకు మాత్రమే కాదని... కిరాయిదారులకు కూడా నోటీసులు ఇస్తామన్నారు. ప్రస్తుతం చెరువుల పునరుజ్జీవంపై దృష్టి సారించామన్నారు. త్వరలో 12 చెరువులను పునరుద్ధరిస్తామని తెలిపారు. అన్ని చెరువుల ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్‌ల వివరాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

జులై 19కి ముందు అనుమతులు పొంది ఉండి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న నివాసాలను కూల్చబోమని హామీ ఇచ్చారు. కమర్షియల్ బిల్డింగ్‌లపై మాత్రం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం హైడ్రా కార్యాలయానికి వచ్చి ఎవరైనా ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు. హైడ్రా ఎవరికీ ఎన్‌వోసీ ఇవ్వదని తెలిపారు.

మధురా నగర్‌లో తాము ఉంటున్న ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని రంగనాథ్ అన్నారు. ఇప్పుడు అక్కడ చెరువు లేదని.. అయినప్పటికీ తాము చెరువు కట్టకు కిలోమీటర్ దూరంలో ఉన్నామని వెల్లడించారు. నెగిటివ్ ప్రచారం సరికాదని అసహనం వ్యక్తం చేశారు.





## మన్మోహన్ సింగ్‌కు అంతిమ వీడ్కోలు

- ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్‌లో అంత్యక్రియలు
- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానితో పాటు విదేశీ ప్రముఖులు హాజరు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ప్రముఖ ఆర్థిక వేత్త, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియులు ముగిశాయి. శనివారం ఉదయం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుండి ప్రారంభమైన అంతిమయాత్ర నిగమ్ బోద్ ఘాట్ వరకు 11 కిలో మీటర్ల మేర సాగింది. ఆర్థిక సంస్కరణలవాదికి తుది వీడ్కోలు పలికేందుకు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్ర సమయంలో మన్మోహన్ సింగ్ పార్థివదేహం ఉన్న వాహనంలోనే రాహుల్ గాంధీ ఇతర కాంగ్రెస్ నేతలు కుర్చుకుని స్మశాన వాటికకు చేరుకున్నారు. నిగమ్ బోద్ ఘాట్ లో సైనిక లాంఛనాల నడుమ జరిగిన మన్మోహన్ సింగ్ అంతిమ సంస్కారాలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, కిరణ్ రిజుజు హాజరై నివాళులు అర్పించారు.

కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు, కర్నాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన్మోహన్ సింగ్ అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్ పార్థివదేహంపై జాతీయ జెండా ఉంచి భారత త్రివిధ దళాలు ఆర్థిక సంస్కరణలవాదికి ఘన నివాళులర్పించాయి. అనంతరం మన్మోహన్ సింగ్ చితికి ఆయన కూతురు నిప్పంటించారు.

## బొకేలకు బదులు పుస్తకాలు ఇవ్వండి



- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్‌ను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన గవర్నర్ ప్రజలకు ప్రత్యేక పిలుపునిచ్చారు. శుభకార్యాలకు వెళ్లినప్పుడు పూల బొకేలు, ఖరీదైన బహుమతులు కాకుండా.. పుస్తకాలనే గిఫ్టులుగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. పుస్తకాలు చదువుతుంటే.. రచయితలతో నేరుగా మాట్లాడిన భావన కలుగుతుందని తెలిపారు. పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంటుందని గవర్నర్ చెప్పుకొచ్చారు. నిరక్షరాస్యుల కోసం కూడా మార్కెట్‌లోకి ఆడియో పుస్తకాలు సైతం వచ్చాయని తెలిపారు. పుస్తకాలను నమిలి మింగేయాలనేంత క్షుణ్ణంగా చదవాలన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సంప్రదాయబద్ధంగా పుస్తకాల్ని ప్రమోట్ చేస్తోందన్నారు. మానవ నాగరికత వర్ధిల్లినంతకాలం పుస్తకాలు ఉంటాయన్నారు. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాల్సిందేనన్నారు.

ఈ-బుక్స్ చదివితే పుస్తకాలు చదివిన ఫీల్ ఉండదని చాలా మంది చెప్తుంటారని తెలిపారు. ఈ- బుక్స్ కంటే కూడా భౌతికంగా పుస్తకాలు చదివితేనే ఎక్కువ మజా ఉంటుందని జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. పుస్తకం చదువుతుంటే నేరుగా ఆ పుస్తక రచయితతో మాట్లాడుతున్న భావన కలుగుతుందని వివరించారు. నేటితరం యువత పుస్తకాల వైపు మళ్లేలా పెద్దలు ప్రొత్సహించాలని కోరారు.

## కందుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



- మద్దతు ధరపై 400 రూపాయల బోనస్ ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సుమారు 6 లక్షల ఎకరాల్లో 2.5లక్షల మెట్రిక్ టన్నుల కందులు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో, వరంగల్ రైతు డిక్లరేషన్‌లో భాగంగా కందులకు మద్దతు ధరతో పాటు అదనంగా 400 రూపాయల బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి రైతులను నమ్మించారని అన్నారు. కానీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా బహిరంగ మార్కెట్‌లో రైతులు కనీస మద్దతు ధర పొందే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.కందులకు మద్దతు ధర 7,550 ఉంది కానీ బహిరంగ మార్కెట్‌లో 6500 నుంచి 6800 మించి క్వింటాలుకు చెల్లింపు జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. ప్రతి క్వింటాలు పైన మద్దతు ధరతో పోలిస్తే రైతులు 800 రూపాయలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉన్నట్టు కనిపిస్తున్నదని అన్నారు. కాబట్టి వెంటనే ప్రభుత్వం కంది రైతుల పట్ల నిర్లక్ష్యం వీడి.. వారి గోస తీర్చడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. అలాగే రైతులకు మద్దతు ధర అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా వరంగల్ రైతు డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం మద్దతు ధరపై 400 రూపాయల బోనస్ కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## జనవరి 7న విచారణకు రండి..

**కేటీఆర్‌కు ఈడీ నోటీసులు..**

**ఫార్ములా- ఈ రేసింగ్ కేసులో కేటీఆర్ కు ఈడీ నోటీసులు..**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కార్ రేసింగ్ కేసులో 2025 జనవరి 7న తమ ఎదుట హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ సహా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా ఈడీ నోటీసులు ఇచ్చింది. జనవరి 2, 3 తేదీల్లో విచారణ కు రావాలని నోటీసులో పేర్కొంది. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద ఈడీ విచారణ చేస్తోంది. ఫెమా నిబంధనలు ఉల్లంఘన జరిగినట్లు ఇప్పటికే గుర్తించిన ఈడీ. ఎఫ్ఈఓకు 55 కోట్లు నగదు బదిలీ , ఆర్థిక పరమైన అవకతవకలు జరిగినట్లు ఈడీ అనుమానం వ్యక్తం చేసింది.

ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కేటీఆర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై ఏసీబీ నమోదు చేసిన కేసులను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ ఈ నెల 21న హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్‌పై ఇప్పటికే విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఈ నెల 30వ తేదీ వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో విచారణ కొనసాగించవచ్చని పేర్కొంటూ కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీ, పురపాలక శాఖ కార్యదర్శి దానకిషోర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం.. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై మరోసారి విచారణ చేపట్టిన హైకోర్టు.. కేసు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని' ఏసీబీ పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు కౌంటర్ దాఖలు చేయాలని కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వం సమయం కోరగా.. విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. అదేవిధంగా ఈ నెల 31 వరకు కేటీఆర్ ను అరెస్ట్ చేయవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

## నాకేం సంబంధం లేదు : కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో డబ్బు చెల్లింపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ మేరకు ఆయన హైకోర్టులో శనివారం అఫిడవిట్ సమర్పించారు. ఈ-కార్ రేసింగ్ కేసుపై ఏసీబీ విచారణ జరుపుతోంది. అయితే తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్వాష్ పిటిషన్‌పై ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. దాంతో కేటీఆర్ రిప్లై ఇస్తూ అఫిడవిట్ దాఖలు చేశారు. ఒప్పందాల అమలు, డబ్బు చెల్లింపుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఈ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఒప్పందం అమలులో విధానపరమైన అంశాలను చూసే బాధ్యత మంత్రిగా తనది కాదని తెలిపారు. విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై పర్మిషన్‌కు సంబంధించి సంబంధిత బ్యాంకు చూసుకోవాలని అందులో పేర్కొన్నారు. ఫార్ములా ఈ-కార్ రేస్ ను ప్రమోట్ చేసే ముందు చెల్లింపులకు సంబంధించి లీగల్ ఇష్యూస్ హెచ్‌ఎండీఏ సంస్థ పరిగణనలో ఉంటాయన్నారు. అలాగే రూ.10 కోట్లు దాటే చెల్లింపులకు కేబినెట్ అనుమతి తీసుకోవాలని హెచ్‌ఎండీఏ నిబంధనల్లో లేదన్నారు. నగర, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఈ వ్యవహారాల్లో తనకు సంబంధం లేదన్నారు.

### నాలుగు నెలల నుంచి

## పెండింగ్‌లో మెస్ బిల్లులు

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

వివరాలు 2వ పేజీలో



## ప్రధానికి గుకేశ్ చెస్ బోర్డు కానుక

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చెస్ ప్లేయర్ డి.గుకేశ్ ఇటీవల వరల్డ్ చాంపియన్ షిప్ గెలుచుకోవడం తెలిసిందే. సింగపూర్ లో జరిగిన వరల్డ్ చెస్ చాంపియన్ షిప్ ఫైనల్లో డింగ్ లిరెన్ పై గుకేశ్ సాధించిన అద్భుత విజయం సాధించాడు. కాగా, గుకేశ్ ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశాడు. తాను వరల్డ్ టైటిల్ గెలుచుకునే క్రమంలో ఫైనల్లో ఆడిన చెస్ బోర్డును ప్రధానికి కానుకగా ఇచ్చాడు. దీనిపై ప్రధాని మోదీ సోషల్ మీడియాలో స్పందించారు.

"గుకేశ్ తో సంభాషణ అద్భుతంగా సాగింది. ఇవాళే కాదు, ఇంతకుముందు కూడా చాలాసార్లు అతడితో మాట్లాడాను. అయితే అతడిలో నాకు బాగా నచ్చే అంశాలు అతడి దృఢసంకల్పం, అంకితభావం. అతడి ఆత్మవిశ్వాసం నిజంగా స్ఫూర్తిదాయకం. కొన్నేళ్ల కిందటి ఓ వీడియోలో గుకేశ్ ఏం చెప్పాడో నాకు గుర్తుంది. తాను చిన్న వయసులోనే వరల్డ్ చాంపియన్ అవుతానని చెప్పాడు. తన స్వయంకృషితో దాన్ని సాధ్యం చేసి చూపించాడు. ఆత్మవిశ్వాసం మాత్రమే కాదు, అతడిలో వినయం, సంయమనం కూడా చూడొచ్చు. ప్రపంచ విజేతగా నిలిచిన సమయంలోనూ అతడు ఎంతో ప్రశాంతంగా ఉన్నాడు" అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.



## హైదరాబాద్ విస్తరణకు మార్గం సుగమమైంది

**మంత్రి కోమటిరెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ల ప్రక్రియ మొదలు కావడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగర విస్తరణకు మార్గం సుగమమైందని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ రాష్ట్ర చరిత్రలో సువర్ణక్షరాలతో లిఖించే రోజు అని వ్యాఖ్యానించారు. 4 ప్యాకేజీలుగా హైదరాబాద్ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు పనులకు జాతీయ రహదారుల అభివృద్ధి ప్రాధికార సంస్థ నోటిఫికేషన్ విడుదల చేయడం కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం సాధించిన విజయమని పేర్కొన్నారు. ఇది కేవలం ఏడాది వ్యవధిలో సాధించిన అద్భుతమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ, నా కృషికి దక్కిన ఫలితం ఆర్ఆర్ఆర్ టెండర్లు అని వెల్లడించారు. ఆర్ఆర్ఆర్ తెలంగాణ బిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు కొమురవెల్లి మల్లన్న కల్యాణం



- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ
- ఏర్పాట్లు చేసిన అధికారులు

వివరాలు 2వ పేజీలో

### నాలుగు నెలల నుంచి

# పెండింగ్‌లో మెస్ బిల్లులు




- **ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రీన్ చాలెంజ్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని, ఒక్క రూపాయి బిల్లు పెండింగ్ లేదని శాసనసభ సాక్షిగా సీఎం చెప్పారని, కానీ నాలుగు నెలల నుంచి మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎం అసెంబ్లీలో చెప్పిన మాటలు అమలు కాకపోవడం దారుణమన్నారు. సిద్దిపేట జిల్లా నాసరపుర కేంద్రంలోని బ్రిడ్జ్ స్కూల్‌లో విద్యార్థులకు పవనసుత యూత్ సభ్యులు స్వెటర్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వనందున చలికాలంలో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. జీతం ఆగొచ్చు కానీ మెస్ బిల్లులు మాత్రం ఆగవు అన్న సీఎం మాట ఏమైందని ప్రశ్నించారు. తక్షణమే అన్ని చోట్ల మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని శాఖలు మీ దగ్గర పెట్టుకొని ఎందుకు రివ్యూ చేయడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ పైసలు ఇచ్చినా గల్లీలో విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300 పెంచిన మెస్‌చార్జీలు ఇప్పటికీ అమలు కాలేదని, అర్బన్ రెసిడెన్షియల్‌లో రూ.1050 మెస్‌చార్జీ ఇస్తున్నారని, కాస్మోటిక్ చార్జీలు ఇంకా రూ.100నే ఇస్తున్నారని, అది కూడా నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. అసెంబ్లీలో చెప్పిన ప్రకారం తక్షణమే మెస్ బిల్లులు, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

యువత 31న దావత్‌లు బంజేసి, హాస్టల్స్‌ను దత్తత తీసుకోవాలని, పిల్లల భవిష్యత్ కోసం సేవ చేయాలని సూచించారు. ఈ స్కూల్‌లో ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన పవనసుత యూత్ వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా యువకులు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజనర్సు, కనకరాజు, సాయిరాం, పవనసుత యూత్ అధ్యక్షులు దొరగొల్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొంక చంద్రం, యాదగిరి, రాజు, లింగం గౌడ్, కాముని నగేశ్, జడేజా, శ్రీనివాస్, మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్, ఆంజనేయులు, లింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మందుబాబులకు గుడ్ న్యూస్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



మందుబాబులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. కొత్త సంవత్సల వేడుకల సందర్భంగా మద్యం అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు డిసెంబర్ 31న తెలంగాణలో మద్యం షాపుల్ని అర్ధరాత్రి వరకూ తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మద్యం షాపులతో పాటు బార్లు, రెస్టారెంట్లు కూడా అర్ధరాత్రి వరకూ తెరిచి ఉంచనున్నారు. మరోవైపు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు, కార్యక్రమాలకు కూడా రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే పార్టీలు, పబ్బుల్లో డ్రగ్స్ వాడకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు షరతు విధించింది.

# నేడు కొమురవెల్లి మల్లన్న కల్యాణం



- **పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్న మంత్రి కొండా సురేఖ**
- **ఏర్పాట్లు చేసిన అధికారులు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు హాజరుకానున్నారు. ఇప్పటికే ప్రముఖులకు ఆహ్వా న పత్రికలు అందజేశారు. మంత్రులు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ గౌడ్ పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించ నున్నారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి కల్యాణోత్సవానికి హాజరుకానున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వరుడు మల్లికార్జున స్వామి తరపున పడిగన్నగారి వంశస్తులు, వధువులు మేడలాదేవి, కేతమ్మదేవీ తరపున మహాదేవుని వంశస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపిస్తారు.

ఆదివారం ఉదయం 10.45 గంటలకు కొమురవెల్లి క్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద గల కల్యాణ వేదికలో 1008 జగద్గురు డాక్టర్ మల్లికార్జున విశ్వరాధ్య శివాచార్య స్వామి ఆధ్వర్యంలో వేద పర్యవేక్షణలో కల్యాణం జరగనున్నది. ఉత్సవాలు రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు.ఆదివారం వేకువజామున 5గంటలకు స్వామి వారికి దిష్టికుంభం(బలిహరణం),10.45 గంటలకు స్వామి కల్యాణం, మధ్యాహ్నం 12గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 7గంటలకు రథోత్సవం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 9గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, అనంతరం మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మల్లన్న కల్యాణోత్సవానికి 30వేల వరకు భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని ఆలయవర్గాలు తెలిపాయి. కల్యాణ వేదిక తోటబావి ప్రాంతంలో నిర్మించిన శాశ్వత కల్యాణ వేదిక వద్ద బారికేడ్లు, షామియానాలు, పచ్చదనం ఉట్టిపడే విధంగా పలు ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణ వేదిక వద్ద మరో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నూతన క్యూలైన్ల నిర్మాణం చేపట్టడడంతో రాజగోపురం వద్ద చలువ పందిళ్లతో తాత్కాలిక క్యూలైన్లు ఏర్పా ట్లు చేశారు. నూతనంగా నిర్మించిన భవనంలో ప్రసాదాల విక్రయ కౌంటర్ల వద్ద తాగునీటి వసతి కల్పిస్తున్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 60వేల లడ్డూ ప్రసాదాలు, 5 క్వింటాళ్ల పులిహోర ప్యాకెట్లను తయారు చేశారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔటసోర్సింగ్ సిబ్బంది మొత్తం 70 మంది, 100 మంది వలంటీర్లు విధులు నిర్వహించనున్నారు. పలువురు ప్రభుత్వశాఖల అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సిద్దిపేట, జనగామ జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేకంగా బస్సులు నడిపించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 300 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వర్తించనున్నారు.

## కేజీబీవీలో కలుషితాహారం.. పది మందికి అస్వస్థత..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నిర్మల్ జిల్లాలోని అనంతపేట కేజీబీవీలోని అన్నం తిన్న పది మంది బాలికలు వాంతులు, కడుపు నొప్పితో బాధపడ్డారు. శనివారం ఈ సంఘటన జరిగింది. విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. అందులో ఐదుగురు పరిస్థితి బాగుందని పాఠశాలకు పంపించారు. మిగిలిన ఐదుగురికి వైద్యులు సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్న విద్యార్థినులను ఎంఈఓ వెంకటేశ్వర్లు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

## మన్మోహన్ సింగ్ స్మారకం నిర్మించాలి..

**ప్రధాని మోడీకి ఖర్గే విజ్ఞప్తి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గౌరవార్థం ఆయన పేరిట స్మారకం నిర్మించాలని ప్రధాని నరేంద్ర మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విజ్ఞప్తి చేశారు. మన్మోహన్ సింగ్ అత్యంత సాధారణ వ్యక్తి నుంచి గొప్ప రాజనీతిజ్ఞుడిగా అంచెలంచెలుగా ఎదిగారని, అలాంటి వ్యక్తికి స్మారకం నిర్మిస్తేనే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని ఖర్గే పేర్కొన్నారు. ఈ మేరకు మోదీకి ఆయన లేఖ రాశారు. “మాజీ ప్రధానుల స్మారకాలు నిర్మించడం ఆచారంగా కొనసాగుతోంది. మన్మోహన్ సింగ్?కూ స్మారకం నిర్మిస్తే బాగుంటుంది. దేశ ముద్దుబిడ్డల్లో ఆయన ఒకరు. తన సేవలతో దేశ ప్రజల్లో ఆయన ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టి తన దార్శనికతతో దేశాన్ని గండం నుంచి గట్టెక్కించారు. దేశాన్ని వృద్ధి వైపు పరుగులు తీయించారు” అని ఖర్గే ఆ ఉత్తరంలో పేర్కొన్నారు.

# రైతు సంఘాల నేతలపై సుప్రీం కోర్టు ఆగ్రహం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



రైతు సంఘాల నేతలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తున్నా, ఆయనకు వైద్య సహాయం అందకుండా అడ్డుకుంటున్న రైతు సంఘాల తీరును అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. నిజంగా ఆయన క్షేమం కోరుకునేవారైతే, అలా వైద్య సాయాన్ని అడ్డుకోరని పేర్కొంది. ఈ విషయాన్ని వారికి తెలియజేయాలని జస్టిస్ సూర్యకాంత్ - పంజాబ్ చీఫ్ సెక్రటరీకి సూచించారు. దల్లేవాల్‌కు వైద్య సహాయం అందించాలన్న ఆదేశాలను అమలుచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కు వ్యతిరేకంగా వ్యాజ్యం దాఖలైంది. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. నిరవధిక దీక్షను కొనసాగిస్తున్న దల్లేవాల్‌కు వైద్యసహాయం అందేలా చూడాలని తాము పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చామని, అయితే వాటిని అమలుచేయడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలపై కోర్టు సంతృప్తి చెందలేదని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఈ విషయంలో పంజాబ్ రాష్ట్రానికి ఏదైనా సహాయం అవసరమైతే, కేంద్ర ప్రభుత్వం మద్దతివ్వాలని సుప్రీం కోర్టు తన ఆదేశాల్లో పేర్కొంది. ఈ కేసుపై తదుపరి విచారణను డిసెంబర్ 31న చేపట్టనున్నట్లు పేర్కొంది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం లాంటి డిమాండ్లతో నవంబరు 26 నుంచి జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పంజాబ్-హరియాణా సరిహద్దులోని ఖనౌరీ శిబిరం వద్ద నిరవధిక నిరసన దీక్ష చేపట్టారు.

## అన్నావర్సిటీ లైంగికదాడి బాధితురాలికి రూ.25 లక్షల నష్టపరిహారం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

చెన్నై లోని అన్నా యూనివర్శిటీ ప్రాంగణంలో లైంగికదాడి గురైన బాధితురాలికి రూ. 25 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. ఈ సంఘటనపై విచారణ జరిపేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిట్‌లోని ముగ్గురు సభ్యులు ఐపీఎస్ అధికారులే ఉండాలని స్పష్టం చేసింది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ఈ పరిణామాల కారణంగా విద్యార్థిని చదువుపై ఎలాంటి ప్రభావం పడకూడదని తెలిపింది. ఆమె నుంచి ఫీజు వసూలు చేయొద్దని యూనివర్శిటీని న్యాయస్థానం ఆదేశించింది. అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థినిపై డిసెంబర్ 23 రాత్రి లైంగికదాడి జరిగింది. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా ఓ యువకుడిని పోలీస్‌లు అరెస్ట్ చేశారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ సంఘటనలో నిందితుడికి డీఎంకేతో సంబంధాలున్నాయని బీజేపీ నేతలు అరోపిస్తున్నారు.

# బాలుడిని జువెనైల్ హెూమ్ కు తరలింపు..

బలగం టీవీ , సిరిసిల్ల :

మైనర్ డ్రైవింగ్ చేస్తూ వ్యక్తి మరణానికి కారణం అయిన బాలుడిని జువెనైల్ హెూమ్ కు తరలించినట్లు చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలో గత పది రోజుల క్రితం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో కంటే రాములు మరణించాడని అన్నారు.కంటే నర్సయ్య ఫిర్యాదు మేరకు మైనర్ కు ద్విచక్ర వాహనం ఇచ్చిన, మైనర్ తల్లి పై కేసు నమోదు చేసి గతంలో రిమాండ్ కి తరలించడం జరిగిందని,అలాగే బాలుడిని జిల్లా ప్రొబేషనరీ అధికారి మరియు జువెనైల్ బోర్డు ముందు ప్రవేశ పెట్టగా జువెనైల్ బోర్డు ఛైర్మన్ ఆదేశాలతో బాలుడిని జువెనైల్ హెూమ్ కు తరలించడం జరిగిందని తెలిపారు..

## ఆప్ పథకాలు ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్ కలిశాయి

● అరవింద్ కేజ్రీవాల్




బలగం టీవీ , న్యూఢిల్లీ

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై మండిపడ్డారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆప్ పార్టీ ప్రతిపాదించిన పథకాలను ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి పని చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. తాజాగా ఆప్ ప్రతిపాదించిన సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఫిర్యాదు చేశారు. దీంతో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా విచారణకు ఆదేశించారు. కాగా, సందీప్ ఫిర్యాదుపై అరవింద్ కేజ్రీవాల్ శనివారం స్పందించారు. ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..'ఢిల్లీ ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధుల కోసం ఆప్ ప్రతిపాదించిన పథకాలను ఆపడానికి కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. బీజేపీకి నేరుగా వ్యవహరించే ధైర్యం లేకపోవడంతో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌తో ఫిర్యాదు చేయించింది. ఆప్‌ను అడ్డుకునేందుకు ఈ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి' అని ఆయన అన్నారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మహిళలకు రూ.2,100, 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఉచిత వైద్యం అందిస్తామని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఈ రెండు పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. 'ఇప్పటికే లక్షల మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. దీనిపట్ల బీజేపీ భయాందోళనలకు గురవుతోంది' అని ఆయన విమర్శించారు.



## 'మన్మోహన్ మరణాన్ని రాజకీయం చేస్తోన్న కాంగ్రెస్'

బలగం టీవీ , హైదరాబాద్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయడం నిరుత్సాహపరిచిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలపై బీజేపీ ప్రభుత్వం ఆయనను అవమానించిందని, మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు అధికారిక శ్మశాన వాటికలో చేయకుండా నిగంబోధ్ ఘాట్ వద్ద జరిపిందని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై స్పందించిన కిషన్ రెడ్డి కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం కోసం స్థలం కేటాయించబడుతుందని, ఇది మాజీ ప్రధానులందరికీ నిబంధనల ప్రకారం జరుగుతుందని హెూంమంత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేకు, మన్మోహన్ సింగ్ కుటుంబసభ్యులకు తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ తన పొలిటికల్ గేమ్‌ను కొనసాగిస్తోందని మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ వారి రాజవంశానికి చెందని మాజీ ప్రధాన మంత్రులైన డా. మన్మోహన్ సింగ్, పి.వి. నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలాంటి వారిని నిరంతరం మోసం చేసి, అవమానించిందని చరిత్ర చెబుతోందని విమర్శించారు. అంతేగాక కాంగ్రెస్ ఆయన మరణానికి సంతాపం వ్యక్తం చేస్తున్నప్పుడు, మన్మోహన్ సింగ్ తన సొంత పార్టీ చేతిలో చవిచూసిన అవమానాలను మనం విస్మరించకూడదని, మన్మోహన్ సింగ్ వారసత్వానికి ఈ సంతాపం కంటే ఎక్కువ అర్హత ఉందని కిషన్ రెడ్డి రాసుకొచ్చారు.

## తొలి టీ20లో కివీస్ గెలుపు

బలగం టీవీ , న్యూఢిల్లీ

సొంత గడ్డపై శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో 8 పరుగుల తేడాతో గెలుపొందింది. 173 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 164 పరుగులకే పరిమితమైంది. పాథుమ్ నిస్సంక(90), కుశాల్ మెండిస్(46) తొలి వికెట్‌కు 121 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే కివీస్ పేసర్ జాకబ్ ఢఫీ 14వ ఓవర్ వేసిన ఢఫీ, కుశాల్ మెండిస్(46), కుశాల్ పెరీరా(0), కమిందు మెండిస్(0)లను ఒకే ఓవర్‌లో ఔట్ చేసి మ్యాచ్‌ను న్యూజిలాండ్ వైపు తిప్పాడు. 60 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 90 పరుగులు చేసిన పాథుమ్ నిస్సంక శ్రమ వృథాగా మారింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కివీస్ బ్యాటర్లలో డారిల్ మిచెల్(62), బ్రాస్‌వెల్(58) అర్ధ శతకాలతో చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది న్యూజిలాండ్.

### జనవరి 1 నుంచి ఆన్ లైన్ ద్వారా

# అధికారులు సెలవు దరఖాస్తులు సమర్పించాలి....

● అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..



బలగం టీవీ , సిరిసిల్ల

జనవరి 1 నుంచి ఆన్ లైన్ ద్వారా అధికారులు సెలవు దరఖాస్తులు సమర్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఈ హెచ్ఆర్ఎం పోర్టల్ ద్వారా సెలవు మంజూరు దరఖాస్తుల నమోదుపై అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అధ్యక్షతన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ శాఖల పరిధిలో పనిచేసే అధికారులు, సిబ్బంది తమ సెలవు దరఖాస్తులను నూతన సంవత్సరం నుంచి ఆన్ లైన్ పోర్టల్ https://e-hrms.gov.in ద్వారా మాత్రమే సమర్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు తమ పరిధిలోని ఈ-ఆఫీస్ లాగిన్ ఐడి వినియోగించుకుని ఉద్యోగుల జాబితా, వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి..




బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

బలగం టీవీ , సిరిసిల్ల

పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయకుండా పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం రవి గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో స్కాలర్షిప్స్ ఫీజు వెంటనే విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఆనాడు పిసిసి అధ్యక్షుడి హెూదాలో రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేస్తామని చెప్పి, అధికారం వచ్చి సంవత్సరం దాటిన ఆ ఊసు ఎత్తకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను మోసం చేసిందని,కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే డిగ్రీ కళాశాల యజమానులు కాలేజీలను బంద్ చేసుకోవడం జరిగిందని అన్నారు. విద్యార్థుల కి స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్మెంట్ రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దం అనిల్, సాయి, వినయ్, కోడం,వెంకటేశం, సమి,అక్రమ్ ,సాయి, గణేష్,విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో డిప్యూటీ తహశీల్దార్

బలగం టీవీ , హైదరాబాద్

రెవెన్యూ శాఖలో మరో అవినీతి చేప ఏసీబీ అధికారులకు చిక్కింది. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల డిప్యూటీ తహశీల్దార్ మల్లేశం రూ. 6వేల లంచం తీసుకుంటు-ండగా శనివారం ఏసీబీ అధికారులు వల పన్ని పట్టు-కున్నారు. ఓ వ్యక్తి దగ్గర నుంచి నాలా కన్వర్షన్ కోసం అనుమతులు కోరగా, డీటీ మల్లేశం లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు చేసేది ఏమీ లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పథకం ప్రకారం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు.. డిప్యూటీ తహసిల్దార్ మల్లేశం లంచం తీసుకుంటుండగా, రెడ్ హ్యాండెడ్ గా పట్టు-కున్నారు. డీటీని అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు.

## తండ్రి కోసం పాట పాడిన హిమాన్షు..

బలగం టీవీ , హైదరాబాద్



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మనుమడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు హిమాన్షు తాజాగా తన తండ్రి పట్ల తనకు ఉన్న ప్రేమ, అభిమానాలను చాటుతూ హిమాన్షు రావు ఒక పాటను పాడాడు. నిజానికి కేటీఆర్ బర్త్ డే కానుకగా జూలైలోనే హిమాన్షు ఓ పాటను పాడాడు. యానిమల్ మూవీలోని ' ఓ నాన్న నువ్వు నా ప్రాణం' అనే పాటను రికార్డు చేశాడు. అయితే ఆ పాటను తాజాగా కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పంచుకున్నారు. తన బర్త్ డే కానుకగా తన కొడుకు హిమాన్షు రావు ఈ పాటను పాడాడని పేర్కొన్నారు. కానీ అది సంతృప్తికరంగా రాలేదని భావించి విడుదల చేయలేదని చెప్పారు. అయితే ఆ పాటను తాను వారం క్రితం మొదటిసారి విన్నానని, హిమాన్షు గానం, పాటలోని సాహిత్యం అద్భుతంగా ఉందని తెలిపారు. ఈ కష్టతరమైన సంవత్సరంలో నాకు దక్కిన ఉత్తమ బహుమతి అని కేటీఆర్ హిమాన్షు పాడిన పాటను ప్రశంసించారు. తన గాత్రంతో ఉత్తమ బహుమతి అందించిన బింకు(హిమాన్షు)కి ధన్యవాదాలు తెలిపారు. ఓ తండ్రిగా గర్వపడుతున్నానని పేర్కొన్నారు.



# సినిమా అనేది చిన్న సమస్య

● పవన్ కళ్యాణ్

బలగం టీవీ , హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో ప్రత్యర్థుల దాడిలో గాయపడ్డ గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును కడప రిమ్స్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అల్లు అర్జున్ అరెస్టు వ్యవహారంపై మీడియా ప్రతినిధులు ప్రస్తావించగా ఆయన స్పందించారు. సమస్యలు చాలా ఉన్నాయని, సినిమా అనేది చిన్న సమస్యని పవన్ అన్నారు. బాధితుడి పరామర్శకు వచ్చినప్పుడు ఇలాంటి విషయాలు మాట్లాడడం సరికాదని హితవు పలికారు. పవన్ కల్యాణ్ పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో నకిలీ ఐపీఎస్ అధికారి కూడా ఉన్నారన్న వ్యవహారంపై కూడా పవన్ కల్యాణ్ స్పందించారు. నకిలీ ఐపీఎస్ అధికారి ఎలా వచ్చాడనేది ఉన్నతాధికారులు చూసుకోవాలని, ఆ బాధ్యత ఇంటెలిజెన్స్, డీజీపీ, హెూంమంత్రిదేనని తెలిపారు. తనకు పని చేయడం ఒక్కటే తెలుసన్న ఆయన తన భద్రత బాధ్యతలను చూసుకోవాల్సిన బాధ్యత పోలీసు పెద్దలదేనని వివరించారు. ఈ అంశంపై తన పేషీ అధికారులు ఏపీ డీజీపీ దృష్టికి తీసుకెళ్లారని, ఈ విషయంపై తాను కూడా డీజీపీతో మాట్లాడతానని తెలిపారు.

**అభిమానులపై ఆగ్రహం**

ఇదిలా ఉండగా, డిప్యూటీ సీఎం పవన్‌ను చూసేందుకు అక్కడికి వచ్చిన పలువురు ఆయన అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన సీరియస్‌గా మీడియాతో మాట్లాడుతున్నప్పుడు 'ఓజీ ఓజీ ఓజీ' అంటూ స్లోగన్స్ చేశారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఏంటయ్యా మీరు. ఎప్పుడు ఏ స్లోగన్ ఇవ్వాలో మీకు తెలియదు. పక్కకు రండి" అంటూ వారిపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్? అసహనం వ్యక్తం చేశారు.

# తెలుగోడి తెగువ

**సెంచరీతో భారత్‌ను ఫాలో ఆన్ గండం నుంచి గట్టెక్కించిన నితీశ్ కుమార్ రెడ్డి**
**భారత్ 355/9**





బలగం టీవీ, మెల్‌బోర్న్

బోర్డర్– గావస్కర్ సిరీస్‌లో తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి(176 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 105 బ్యాటింగ్) అదరగొట్టాడు. సూపర్ సెంచరీ చేసి మెల్‌బోర్న్ టెస్టులో భారత్‌ను ఫాలో ఆన్ నుంచి గండం నుంచి గట్టెక్కించాడు. ఇక అతను హాఫ్ సెంచరీ, సెంచరీ చేసినప్పుడు పుష్ప, బాహుబలి సలార్ సినిమా స్టైల్లో అభివాదం చేసి ఆకట్టుకున్నాడు. నితీష్‌తో పాటు వాషింగ్టన్ సుందర్(162 బంతుల్లో ఫోర్‌తో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు.

221కే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న జట్టును ఆల్‌రౌండర్లు నితీశ్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ ఆదుకున్నారు. ఈ క్రమంలో నితీశ్ కుమార్ టెస్టుల్లో తొలి సెంచరీ నమోదుచేయగా, సుందర్ నాలుగో హాఫ్ సెంచరీ చేశాడు. ఇద్దరూ కలిసి ఎనిమిదో వికెట్‌కు 127 పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించారు. అయితే సుందర్ 162 బాల్స్‌లో 50 రన్స్ చేసి నాథన్ బౌలింగ్‌లో క్యాచౌట్‌గా వెనుతిరగడంతో ఈ జోడీ జోరుకు బ్రేక్‌పడింది. అయితే ఆ తర్వాత వచ్చిన బుమ్రా కూడా వెంటనే వెనుతిరగడంతో నితీశ్‌కు సెంచరీ చేసే అవకాశం వస్తుందా అనే టెన్షన్ అందరిలో నిండిపోయింది. అప్పటికే 97 రన్స్ చేసిన నితీశ్.. రెండు పరుగులు చేసి 99కి చేరాడు. ఆ తర్వాత బోలాండ్ బౌలింగ్‌లో (ఇన్నింగ్స్ 114.3 ఓవర్) ఫోర్ కొట్టి టెస్టుల్లో తొలి సెంచరీ నమోదుచేశాడు. హాఫ్ సెంచరీ సమయంలో తగ్గేదే లే అన్నట్లు పుష్ప స్టయిల్‌లో సెలబ్రేట్ చేసుకున్న నితీశ్.. సెంచరీని బాహుబలి, సలార్ స్టైల్‌లో సెలబ్రేట్ చేసుకున్నాడు. గాల్లోకి పంచ్ విసుతూ.. మోకాలిపై కూర్చుని బ్యాట్ హ్యాండిల్‌కు హెల్మెట్ పెట్టి భగవంతునికి కృతజ్ఞత తెలిపాడు. ఈ సమయంలో ప్రేక్షకులతోకలిసి మ్యాచ్ చూస్తున్న నితీశ్ తండ్రి ఆనందం వ్యక్తం చేశాడు. కుమారుడి తొలి సెంచరీని చూసి భావోద్వేగానికి లోనయ్యారు.



కాగా, నితీశ్ తన తొలి సెంచరీ తర్వాత మరో రెండు పరుగులు జోడించిన తర్వాత.. బ్యాడ్ లైట్ కారణంగా అంపైర్లు మ్యాచ్ నిలిపి వేశారు. దీంతో గ్రౌండ్ స్టాఫ్ పిచ్‌ను కవర్స్‌తో కప్పేయడంతో మూడో ఆట ముగిసింది. మొత్తంగా భారత్ 9 వికెట్లు కోల్పోయి 355 రన్స్ చేసింది. ప్రస్తుతం నితీశ్ (104), సిరాజ్ (2) రన్స్‌తో నాటౌట్‌గా ఉన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 116 రన్స్ వెనుకపడి ఉన్నది. పంత్ (28), జడేజా (17) రన్స్ చేశారు. టీమ్‌ఇండియా తరపున నితీశ్ 104 రన్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచారు. క్రీజులో నితీష్ కుమార్ రెడ్డితో పాటు మహమ్మద్ సిరాజ్(0 బ్యాటింగ్) ఉన్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో కమిన్స్, బోలాండ్ 3 వికెట్ల చొప్పున తీయగా, నాథన్ 2 వికెట్లు పడగొట్టాడు.

**బోర్డర్-గవాస్కర్ టోర్నమెంట్‌లో తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ అదరగొట్టిన సంగతి తెలిసిందే. నితిష్ కుమార్ రెడ్డి సెంచరీ సాధించడంతో స్టాండ్స్‌లో ఉన్న అతని తండ్రి ముత్యాలరెడ్డి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు! లేచి నిలబడి చప్పట్లు కొట్టి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.**

బలగం టీవీ, మెల్‌బోర్న్





## రిషబ్ పంత్ అవుట్‌పై గవాస్కర్ తీవ్ర విమర్శలు..!


బలగం టీవీ, మెల్‌బోర్న్

మెల్ బోర్న్ లో జరుగుతున్న మ్యాచ్ లో భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ ఔట్ అయిన తీరుపై విమర్శలు వస్తున్నాయి. జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో పంత అనవసరంగా షాట్ ఆడి వికెట్ పడేసుకున్నాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.. ఓవర్ నైట్ స్కోర్ 164/5 వద్ద మూడో బ్యాటింగ్ దిగిన ఇండియా ఆదిలోనే వికెట్ కోల్పోయింది. బోలాండ్ బౌలింగ్ లో స్కూఫ్ షాట్ ఆడడానికి పంత్ ప్రయత్నం చేశాడు. అయితే అది కాస్త క్యాచ్ గా వెళ్లింది. డీప్ థర్డ్ మ్యాన్ పొజిషన్ వద్ద ఉన్న లయన్ క్యాచ్ పట్టడంతో పంత్ వెనుదిరగాల్సి వచ్చింది. భారత్ కు పాలో ఆన్ గండం ఉన్నప్పటికీ పంత్ అలా ఆడడంపై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఫైర్ అయ్యారు. జట్టును ఫాలో ఆన్ గండం వెంటాడుతుంటే.. పంత్ ఇష్టమొచ్చినట్లు ఆడతాడా అని గవాస్కర్ ప్రశ్నించారు.

“స్టుపిడ్, స్టుపిడ్, స్టుపిడ్.. ఇది మూర్ఖత్వం కాదు, అంతకుమించి.. మీరు అటువంటి షాట్ ఆడతారని తెలిసి అక్కడ ఇద్దరు ఫీల్డర్లను పెట్టాడు. అయినప్పటికీ అలాంటి షాట్ ఆడారంటే మిమ్మల్ని ఏం అనాలో అర్థం కావట్లేదు. జట్టు పరిస్థితులు అర్థం చేసుకోవాలి కదా” అంటూ విమర్శించాడు.

## సల్మాన్ ఖాన్ 'సికందర్' టీజర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్




కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఏఆర్ మురుగదాస్, బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'సికందర్'. ప్రస్తుతం శరవేగంగా షుఉటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఈద్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మూవీ నుంచి తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ముందు అనుకున్నట్లుగా సల్మాన్ బర్త్‌డే కానుకగా.. డిసెంబర్ 27నే విడుదల చేద్దామని ప్లాన్ చేశారు. కానీ భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చనిపోవడంతో టీజర్‌ను వాయిదా వేసి శనివారం విడుదల చేశారు. ఫుల్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఈ ట్రైలర్ ఉంది. ఈ సినిమాను నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తున్నారు.

## 'మార్కో' తెలుగు ట్రైలర్ రిలీజ్

బలగం టీవీ, హైదరాబాద్




'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'ఖిలాడీ' 'యశోద', మాలికాపురం వంటి చిత్రాలతో తెలుగు ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు మలయాళీ నటుడు ఉన్ని ముకుందన్ ప్రధాన పాత్రలో వస్తున్న తాజా చిత్రం మార్కో మైఖేల్, ది గ్రేట్ ఫాదర్ సినిమాల ఫేమ్ హనీఫ్ అదేని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. యాక్షన్ జానర్‌లో ఈ సినిమా వచ్చింది. డిసెంబర్ 20న మలయాళంలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా.. 5 రోజుల్లో రూ.50 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఇదే సినిమాను తెలుగులో విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సినిమాను తెలుగులో జనవరి 01న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సందర్భంగా తెలుగు ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం.

## రాజమౌళి మహేశ్‌బాబు సినిమాలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా..!

బలగం టీవీ, హైదరాబాద్



రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబోలో తెరకెక్కబోతున్న %బూవీదీ% 29 లో ప్రియాంక చోప్రా నటించబోతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాలో ప్రియాంక చోప్రా నటించబోతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు, నగర శివార్లలో కొన్ని భారీ సెట్లను కూడా రూపొందించారు. తొలి షెడ్యూల్ వాటిలోనే జరగనున్నట్టు సమాచారం. మహేష్ బాబు పక్కన ఇండోనేషియా హీరోయిన్ చెలిసా ఎలిజబెత్ నటిస్తుందని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొనే పేరు కూడా వినిపించింది. ఇప్పుడు ఈ లిస్టులోకి ప్రియాంక చోప్రా వచ్చి చేరింది. ప్రియాంక చోప్రాకి అనేక ఆఫర్లు వచ్చినా సౌత్ సినిమాలు చేయడానికి ఆసక్తి చూపలేదని తెలిసింది. ఏడేళ్లుగా కేవలం ఇంగ్లీష్ సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న ప్రియాంక చోప్రా.. రాజమౌళి–మహేష్ బాబు సినిమా చేసేందుకు ఓకే చెప్పినట్టు సమాచారం.

## 2024 యూట్యూబ్ టాప్ సాంగ్స్‌లో కుర్చీని మడతపెట్టి



బలగం టీవీ, హైదరాబాద్

2024లో నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు, నటి శ్రీలీల నటించిన 'గుంటూరు కారం' సినిమాలోని 'కుర్చీ మడతపెట్టి' పాట ఎంత పెద్ద హిట్టో తెలిసిందే. తాజాగా ఈ పాట మరో అరుదైన ఘనత సాధించింది. విడుదలైనప్పటి నుంచే యూట్యూబ్‌లో ఇప్పటిదాకా 526 ప్లస్ మిలియన్ వ్యూస్ సాధించింది. ఈ క్రమంలోనే 2024 యూట్యూబ్ మ్యూజిక్‌లో టాప్ సాంగ్స్‌లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని యూట్యూబ్ ట్విట్టర్‌లో అధికారికంగా తెలిపింది. ఈ లిస్ట్‌లో హాలీవుడ్ స్థాయిలో మొత్తం 8 పాటలు ఎంపికవ్వగా, అందులో 'కుర్చీ మడతపెట్టి' సాంగ్ చోటు దక్కించుకుంది. కేవలం తెలుగులోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ తెలుగు పాట సత్తా చాటడం విశేషం. కాగా, ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా, సాహితి చాగంటి, శ్రీ కృష్ణ ఆలపించారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందించారు. ఇక హీరో మహేశ్ బాబు– శ్రీలీల పాటకు హుషారైన స్టెప్పులతో ఇరగదీశారు.